ఏసీబీకి చిక్కిన ఆర్ఐ

నిజామాబాద్ క్రైం, అక్టోబర్ 12 : లంచం తీసుకుంటూ నిజామాబాద్ సౌత్ తహసీల్ కార్యాలయ ఆర్ఐ ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఏసీబీ నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి డీఎస్పీ ఆనంద్‌కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌లోని కుమార్‌గల్లీ ప్రాంతానికి చెందిన బంటు రామరాజు అనే వ్యక్తికి సంబంధించిన భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మీసాల రాజు రూ.8 వేలు లంచం డిమాండ్ చేశాడు. ఒప్పందం మేరకు బంటు రామరాజు గురువారం డబ్బులు తీసుకొని సౌత్ తహసీల్ కార్యాలయానికి వచ్చారు. రామరాజు నుంచి ఆర్ఐ రాజు రూ.8 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అక్కడే ఉన్న ప్రైవేటు వ్యక్తి హరీశ్‌కుమార్ సైతం ఆర్ఐకి సహకరించినట్టు డీఎస్పీ తెలిపారు. వీరిద్దరిని అదుపులోకి తీసుకొని కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

వామన్‌రావు హత్య కేసులో ఇద్దరికి బెయిల్

పెద్దపల్లి కమాన్, అక్టోబర్ 12: హైకోర్టు లాయర్ దంపతులు గట్టు వామన్‌రావు-పీవీ నాగమణి హత్య కేసులో నిందితులు ఏ-1 కుంట శ్రీనివాస్, ఏ-2 సీమంతుల చిరంజీవికి పెద్దపల్లి జిల్లా కోర్టు బెయిల్ మంజూరు చేసింది. గురువారం కోర్టులో నిందితుల తరపు న్యాయవాది బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా.. వాదనలు విన్న ప్రాసిక్యూషన్ బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. 2021 ఫిబ్రవరి 17న పెద్దపల్లి-మంథని రహదారిలోని కల్వచర్ల సమీపంలో కారులో ప్రయాణిస్తున్న గట్టు వామన్‌రావు, పీవీ నాగమణి హత్యకు గురైన విషయం తెలిసిందే.

గూగుల్ క్రోమ్ అప్‌డేట్ చేసుకోండి

న్యూఢిల్లీ, అక్టోబర్ 12: సాఫ్ట్‌వేర్‌లో చాలా లోపాలున్నాయని ప్రముఖ వెబ్ బ్రౌజర్ గూగుల్ క్రోమ్‌కు 'ఇండియా కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్' (సెర్ట్-ఇన్) తాజాగా హెచ్చరికలు జారీ చేసింది. వెబ్ బ్రౌజింగ్ సేవల్ని అడ్డుకునేందుకు సైబర్ దాడి జరగొచ్చునని సెర్ట్-ఇన్ తెలిపింది. బుధవారం దీనికి సంబంధించి భారత్‌లోని నెటిజన్లకు ఒక నోట్ విడుదల చేసింది.

బీఆర్ఎస్ గేమ్‌చేంజర్

- 75 ఏండ్లు ఏలిన కాంగ్రెస్, బీజేపీలు విఫలమయ్యాయి
- 'ఇండియా' కూటమి ప్రజలకు కొత్తగా ఏం చేస్తుంది?
- దక్షిణాదిలో సీట్ల పునర్విభజనపై బీజేపీ వైఖరి ఏమిటి?
- ఏబీపీ సదరన్ రైజింగ్ సమ్మిట్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

> దేశంలో అనేక ప్రాంతీయ పార్టీలు బలమైన శక్తిగా ఎదిగాయి. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు 75 ఏండ్లపాటు పాలించే సమయం లభించినా ఏమీ చేయలేదు. జాతీయస్థాయిలో మరో రాజకీయ శక్తిగా ఎదగాలని మా పార్టీ భావిస్తున్నది. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత ఇండియా కూటమి పతనం తప్పదు. 2024 ఎన్నికల్లో దక్షిణాదిన బీజేపీకి ఒక్క సీటు కూడా రాదు.
> - ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): దేశరాజకీయాల్లో బీఆర్ఎస్ గేమ్‌చేంజర్ కాబోతున్నదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధీమావ్యక్తంచేశారు. దశాబ్దాల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్, బీజేపీలు అన్ని రంగాల్లో విఫలమయ్యాయని, ప్రాంతీయ పార్టీలు మంచి పనితీరును ప్రదర్శిస్తున్నాయని పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వాన్ని గద్దెదించాలన్న ఏకైక లక్ష్యంతో పనిచేస్తున్న ఇండియా కూటమి.. ప్రజల కోసం ఏమి చేస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. దక్షిణాదిన బీజేపీకి ఒక్క సీటు కూడా రాదని తేల్చిచెప్పారు. తెలంగాణ ఎన్నికల్లో బీఆర్ఎస్ మరోసారి అధికారంలోకి వస్తుందని స్పష్టంచేశారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ చేసిన పనులు బీజేపీ వంద జన్మలెత్తినా చేయలేదని అన్నారు. చెన్నైలో గురువారం ఏబీపీ నెట్‌వర్క్ సంస్థ నిర్వహించిన సదరన్ రైజింగ్ సమ్మిట్‌లో '2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు? ఎవరు ఓడుతారు?' అంశంపై జరిగిన చర్చా వేదికలో పాల్గొన్న కవిత తన అభిప్రాయాలను వెల్లడించారు. ఇండియా -ఎన్డీయే కూటములకు బీఆర్ఎస్ సమదూరంగా ఉండటం, తెలంగాణ అభివృద్ధి, బీజేపీ పక్షపాతం వంటి అంశాలపై మాట్లాడారు. ప్రముఖ రచయిత చేతన్ భగత్ సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ చర్చా గోష్ఠిలో కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం, తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు కే అన్నామలై కూడా పాల్గొన్నారు. దేశంలో అనేక ప్రాంతీయ పార్టీలు బలమైన శక్తిగా ఎదిగాయని, బీజేపీ, కాంగ్రెస్ కంటే చాలా ప్రాంతీయ పార్టీలు మంచి పనితీరును ప్రదర్శిస్తున్నాయని కవిత తెలిపారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణలో పెరిగిన వృద్ధి శాతమే అందుకు నిదర్శనమని అన్నారు. జాతీయస్థాయిలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు 75 ఏండ్లపాటు పాలించే సమయం లభించినప్పుడు ఏమీ చేయలేదని విమర్శించారు. అందువల్లనే జాతీయస్థాయిలో మరో రాజకీయ శక్తిగా ఎదగాలని తమ పార్టీ భావిస్తున్నదని, తెలంగాణలో తాము ఏమి చేశామో దానిని దేశమంతా విస్తరిస్తామని ప్రకటించారు. దశాబ్దాల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్, బీజేపీలు ప్రజలను అసంతృప్తికిలోను చేశాయని, తమ పార్టీ జాతీయ స్థాయిలో ఏ కూటమిలోనూ ఉండదల్చుకోలేదని తేల్చిచెప్పారు.

ఎన్నికల తర్వాత 'ఇండియా' పతనం

తృణమూల్ కాంగ్రెస్, బీజేడీ, వైఎస్సార్సీపీ, బీఆర్ఎస్ స్వతంత్రంగా ఎక్కువ సీట్లు సాధించగలవని కవిత చెప్పారు. బీఆర్ఎస్ మాత్రమే కాకుండా ఎవరైనా గేమ్ చేంజర్ కావచ్చని అభిప్రాయపడ్డారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత ఇండియా కూటమి పతనమవుతుందని, ఆ రాష్ట్రాల ఎన్నికల ఫలితాలతో పార్టీల అభిప్రాయం మారవచ్చునని అన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత ప్రతి పార్టీ తమ వ్యూహాలపై పునరాలోచన చేస్తాయని, ఇండియా కూటమిలో కొనసాగాలా లేదా స్వతంత్రంగా పోటీ చేయాలా అని ఆలోచన చేస్తాయని అభిప్రాయపడ్డారు.

ఇండియా కూటమి ఎజెండా ఏమిటి?

బీజేపీని గద్దెదించాలన్నది ఇండియా కూటమి ఏకైక ఎజెండా అని, కానీ ప్రజల కోసం ఆ కూటమి ఎజెండా ఏమిటి? అని కవిత ప్రశ్నించారు. బీజేపీని గద్దెదించడమే ఇండియా కూటమి లక్ష్యమైతే మరి ప్రస్తుత ప్రభుత్వం కంటే ప్రజలకు వారు ఏం మెరుగైన పనులు చేస్తారని అడిగారు. 'బెంగాల్‌లో తృణముల్ కాంగ్రెస్, కమ్యునిస్టు పార్టీలు కొట్లాడుకుంటాయి, కేరళలో కాంగ్రెస్, సీపీఎం మధ్య పోరు, పంజాబ్‌లో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు తలపడుతాయి.. కానీ ఇవన్నీ ఇండియా కూటమిలో ఉన్నాయి. ఇవి సీట్లను ఎలా పంచుకుంటాయి' అని ప్రశ్నించారు.

బీజేపీ వందజన్మలెత్తినా..

కాళేశ్వరం ప్రాజెక్టును రికార్డు స్థాయిలో మూడున్నరేండ్ల కాలంలో పూర్తిచేశామని, 73 లక్షల ఎకరాలకు ఆ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందుతున్నదని కవిత చెప్పారు. తెలంగాణకు సీఎం కేసీఆర్ చేసిన పనులను బీజేపీ 100 జన్మలెత్తినా చేయలేదని వ్యాఖ్యానించారు.

కార్పొరేట్లను ప్రోత్సహిస్తున్న మోదీ

మోదీ ప్రభుత్వం అశ్రిత పెట్టుబడిదారి విధానాన్ని ప్రోత్సహించకపోతే రూ.12 లక్షల కోట్ల మేర కార్పొరేట్ల రుణాలను ఎలా రద్దు చేశారని కవిత ప్రశ్నించారు. రైతు రుణమాఫీ గురించి బీజేపీ ఎందుకు మాట్లాడదని నిలదీశారు. కుటుంబపాలన గురించి మాట్లాడే బీజేపీ.. జ్యోతిరాదిత్య సింధియాను కేంద్ర మంత్రిని ఎలా చేసిందని అడిగారు. గతంలో తమిళనాడులో డీఎంకే పార్టీతో బీజేపీ పొత్తు పెట్టుకున్ననాడు, మహారాష్ట్రలో శివసేనతో పొత్తుపెట్టుకున్నప్పుడు అవి కుటుంబ పార్టీలని తెలియదా? అని నిప్పులు చెరిగారు. ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి మాజీ ముఖ్యమంత్రి కుమార్తె అన్న విషయం బీజేపీకి తెలియదా? అని ప్రశ్నించారు.

బీజేపీ దృష్టిమళ్లింపు రాజకీయాలను ప్రజలు నమ్మరు

బీజేపీ దృష్టిమళ్లింపు రాజకీయాలు చేస్తున్నదని, అవి కొన్నిసార్లు పనిచేశాయని, ఇకపై పనిచేయబోవని కవిత స్పష్టం చేశారు. 2026 తర్వాత జరగబోయే నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాలు సీట్లు కోల్పోతాయని, దీనిపై బీజేపీ వైఖరి ఏమిటని ఆ పార్టీ తమిళనాడు అధ్యక్షుడు అన్నామలైని ప్రశ్నించారు. దీనిపై ప్రజలకు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జాతీయ స్థాయిలో దక్షిణాది రాష్ట్రాలు రాజకీయ ప్రాతినిధ్యాన్ని కోల్పోడానికి సిద్ధంగాలేవని తేల్చిచెప్పారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించి తెలంగాణ వంటి రాష్ట్రాల్లోని ప్రాజెక్టులకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇష్టమున్న రాష్ట్రాలకే బీజేపీ నిధులు ఇస్తున్నదని, దేశ ప్రజలపై రూ.100 లక్షల కోట్ల రుణభారాన్ని మోపిందని ఆమె ధ్వజమెత్తారు. గతంలో పనిచేసిన ప్రధానమంత్రులంతా కలిసి రూ. 50 లక్షల కోట్ల అప్పులు చేస్తే ఒక్క మోదీ ప్రభుత్వమే రూ. 100 లక్షల కోట్ల అప్పులు చేసిందని ఆరోపించారు. ఇతర దేశాల చొరబాటును అడ్డుకుంటామని ప్రధాని మోదీ ప్రకటించారని, కానీ చైనా మన భూభాగంలో రోడ్ల వంటి నిర్మాణాలు చేపడుతున్నా కేంద్రం పట్టనట్టు వ్యవహరిస్తున్నదని విమర్శించారు.

కులగణన అంటే భయమెందుకు?

కులగణన చేయాలంటే బీజేపీకి భయమెందుకని కవిత ప్రశ్నించారు. కరోనా వల్ల 2021లో చేపట్టాల్సిన జనగణన వాయిదా పడిన తర్వాత మళ్లీ ఎందుకు చేపట్టడం లేదని అడిగారు. తెలంగాణ ఏర్పడిన కొత్తలో సమగ్ర కుటుంబ సర్వే పేరిట ఒకేరోజున రాష్ట్ర వ్యాప్తంగా కులగణన చేపట్టామని, దానివల్ల అన్ని వర్గాల ప్రజలకు తగిన విధంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందుతున్నాయని గుర్తుచేశారు. దేశంలో కులగణన జరగకపోవడానికి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు సమాన బాధ్యత వహించాలని అన్నారు. కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. మత రాజకీయాలపై ఆమె స్పందిస్తూ.. రాజకీయ హిందువులు, ఆచరించే హిందువులు ఉన్నారని అన్నారు. బీజేపీది రాజకీయ హిందుత్వమని, దక్షిణాది ప్రజలు ఆచరించే హిందువులని చెప్పారు.

ఆర్‌అండ్‌బీలో ఇంజినీర్ల సర్దుబాటు

- పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పూర్తి
- నూతనంగా 376 పోస్టుల భర్తీ
- కొత్త కార్యాలయాల్లో విధులు

హైదరాబాద్, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పూర్తయింది. ఫలితంగా నూతన జవసత్వాలు సంతరించుకున్నది. ఇక నుంచి నూతన కార్యాలయాల ద్వారా కార్యకలాపాలు మొదలుకానున్నాయి. పెరిగిన సర్కిల్, డివిజన్, సబ్ డివిజన్ కార్యాలయాల్లో 376 మంది మినిస్టీరియల్ స్టాఫ్‌ను నియమించారు. టెక్నికల్ పోస్టులైన ఇంజినీర్ పోస్టులను ఇదివరకే ప్రస్తుత అధికారులకు అదనపు బాధ్యతలు కల్పించడం ద్వారా సర్దుబాటు చేశారు. కొత్త కార్యాలయాల్లో నాన్ టెక్నికల్, మినిస్టీరియల్ స్టాఫ్ నియామకాన్ని పూర్తిచేశారు.

వేగం పుంజుకోనున్న నిర్మాణ పనులు

శాఖ పునర్వ్యవస్థీకరణలో మొత్తం 3,371 పోస్టులను నిర్ధారించగా, ప్రస్తుతం ఉన్న పోస్టులు 2,961 పోగా, కొత్తగా 472 పోస్టులను మంజూరుచేశారు. ప్రస్తుతమున్న పోస్టుల్లో 392 హెచ్‌వోడీ పోస్టులు కాగా, 2,569 ఫీల్డ్‌స్టాఫ్ పోస్టులున్నాయి. కొత్తగా ఏర్పడ్డ 472 పోస్టులను ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసి భర్తీ చేసేవరకు ప్రస్తుతమున్న అధికారులతో సర్దుబాటుచేశారు. కొత్తగా ఏర్పాటైన మూడు చీఫ్ ఇంజినీర్, పది సూపరింటెండెంట్ ఇంజినీర్, 13 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయాలుసహా మొత్తం 328 ఆఫీసులను జూన్ 2వ తేదీన ప్రారంభించిన విషయం విదితమే. ఇప్పుడు మినిస్టీరియల్ స్టాఫ్ నియామకం పూర్తికావడంతో ఇక నూతన కార్యాలయాల నుంచి కార్యకలాపాలు సాగనున్నాయి. నూతన కార్యాలయాల ఏర్పాటు వల్ల పరిపాలన వికేంద్రీకరణ జరిగి రహదారుల నిర్మాణం, రహదారుల మరమ్మతులు, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం, నర్సింగ్ కాలేజీలు, మెడికల్ కాలేజీలు, ప్రభుత్వ దవాఖానల నిర్మాణంలో వేగం పుంజుకునే అవకాశం ఉన్నది.

ఆర్‌అండ్‌బీలో కొత్తగా ఏర్పాటైన కార్యాలయాలు

	పాతవి	కొత్తవి	మొత్తం
సర్కిళ్లు	15	10	25
డివిజన్లు	49	13	62
సబ్ డివిజన్లు	135	79	214
సెక్షన్లు	332	124	456

తుపాకీతో అత్తను కాల్చిన కానిస్టేబుల్

- హనుమకొండలో ఘటన
- అదుపులో నిందితుడు ప్రసాద్

నిందితుడు ప్రసాద్

నయీంనగర్/వరంగల్ చౌరస్తా/కోటపల్లి, అక్టోబర్ 12: పిస్టల్‌తో అల్లుడు అత్తను చంపిన ఘటన హనుమకొండలోని కేయూసీ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ గుండ్లసింగారానికి చెందిన అనిగాల కమల(50)కు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె రమాదేవి భర్త ఏ ప్రసాద్ రామగుండం కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లా కోటపల్లి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. భార్యతో కొన్నేండ్లుగా గొడవలు జరుగుతున్నాయి. తనను, తన కుటుంబాన్ని సరిగ్గా చూసుకోవడం లేదని ప్రసాద్‌పై ఇటీవల రమాదేవి ఫిర్యాదు చేయడంతో నెలకు రూ.15వేల చొప్పున డబ్బులిస్తానని చెప్పాడు. కొన్ని రోజుల క్రితం బామ్మర్దితోనూ గొడవపడ్డాడు. ఈ క్రమంలో ప్రసాద్ అదే పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్సై తుపాకీని తీసుకుని గురువారం అత్తగారి ఇంటికి వచ్చాడు. గతంలో ఇచ్చిన రూ.4 లక్షల గురించి అడిగాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి గన్‌తో అత్తను కాల్చి చంపాడు. దీంతో రమాదేవి ఏడుస్తూ 'మా అమ్మను ఎందుకు చంపావంటూ' నెట్టేయడంతో ప్రసాద్ తల గోడకు తాకడంతో తీవ్రగాయాలై స్పృహ కోల్పోయాడు. పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం ఎంజీఎం దవాఖానకు తరలించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నదని తెలిపారు. హత్య జరిగిన స్థలాన్ని డీసీపీ బారీ, ఏసీపీ డేవిడ్ రాజ్, సీఐలు అబ్బయ్య, గోపి, కరుణాకర్ క్లూస్ టీం, ఇతర సిబ్బంది పరిశీలించారు.

తుపాకీ తస్కరణపై విచారణ

కానిస్టేబుల్ వాడిన తుపాకీపై రామగుండం సీపీ రెమా రాజేశ్వరి ఆదేశాల మేరకు.. మంచిర్యాల జిల్లా కోటపల్లి పోలీస్‌స్టేషన్‌లో డీసీపీ సుధీర్ కేకన్ విచారణ జరిపారు. గోదావరిఖనిలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ప్రసాద్ ప్రవర్తన సరిగా లేకపోవడంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఇటీవల కోటపల్లికి బదిలీ చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న ప్రసాద్ బుధవారం రాత్రి తనకు వారెంట్ కావాలని పోలీస్ అధికారిని అడిగాడు. ఆయుధాలు భద్రపరిచే గదిలో వారెంట్ బుక్ ఉండగా.. తాళం చెవి తీసుకొని గదిలోకి వెళ్లిన ప్రసాద్ వారెంట్ బుక్‌తోపాటు ఎస్సై రివాల్వర్ తీసుకున్నట్టు అనుమానాలున్నాయి. విచారణ నివేదికను సీపీకి పంపించనున్నట్టు డీసీపీ తెలిపారు.

ఐఐటీయన్లు ఇస్రోలో చేరడం లేదు

- ఇస్రో చైర్మన్ సోమనాథ్ వెల్లడి

న్యూఢిల్లీ: ఇస్రోలో చేరడానికి ఐఐటీయన్లు ఆసక్తి చూపటం లేదని, దీంతో అత్యుత్తమ ఇంజనీరింగ్ టాలెంట్‌ను పొందలేకపోతున్నామని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇస్రో వేతనాలే ఇందుకు కారణం కావొచ్చునని అన్నారు. 'ఇంజినీర్లు, ఐఐటీయన్లు నైపుణ్యం కలిగిన మానవ వనరులు. అయితే వారిని ఇస్రోలో చేర్చుకునేందుకు వెళితే, ఎవ్వరూ ఆసక్తిచూపటం లేదు. కొద్ది మంది విద్యార్థులు మాత్రమే అంతరిక్షంపై ఆసక్తితో వస్తున్నారు' అని సోమనాథ్ అన్నారు. ఇస్రో బృందం ఐఐటీలో నిర్వహించిన రిక్రూట్‌మెంట్ డ్రైవ్ గురించి చెబుతూ, 'ఇస్రోలో అత్యధిక వేతనం ఎంతుంటుందన్నది చెప్పగానే, 60% మంది ఐఐటీయన్లు రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నుంచి బయటకు వెళ్లిపోయారు' అని అన్నారు.

జనంపై జమిలిని రుద్దొద్దు

- మాజీ సీఈసీ ఖురేషీ

న్యూఢిల్లీ:లోక్‌సభ, శాసనసభలకు ఒకేసారి ఎన్నికల నిర్వహణపై జాతీయ స్థాయిలో ఏకాభిప్రాయం లేకపోతే, జనం మీద జమిలి ఎన్నికలను రుద్ద కూడదని మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఎస్‌వై ఖురేషీ చెప్పారు. ఆయన రాసిన పుస్తకం 'ఇండియాస్ ఎక్స్‌పెరిమెంట్ విత్ డెమొక్రసీ : ది లైఫ్ ఆఫ్ ఏ నేషన్ త్రూ ఇట్స్ ఎలక్షన్స్' ఆవిష్కరణ నేపథ్యంలో ఓ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా పార్టీలకు విరాళాలిచ్చే విధానంలో పారదర్శకత లేదన్నారు.

జమిలితో ప్రయోజనమే: అవస్థీ

జమిలి ఎన్నికలు దేశాభివృద్ధికి దోహదం చేస్తాయని లా కమిషన్ చైర్మన్ రితురాజ్ అవస్థీ అభిప్రాయపడ్డారు. ఓ న్యూస్ వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ జమిలి ఎన్నికల వల్ల వ్యయం తగ్గుతుంది

సిరియాతో వార్

మొదటిపేజీ తరువాయి...

లక్ష్యంగానే ఇజ్రాయెల్ దాడులు చేసినట్టు తెలుస్తున్నది. హమాస్ దాడుల వెనుక ఇరాన్ ఉందని ఇజ్రాయెల్ మొదట్నుంచి భావిస్తున్నది. దీంతో గురువారం సిరియా పర్యటనకు వచ్చిన ఇరాన్ దౌత్యవేత్తలను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడినట్టు పలువురు భావిస్తున్నారు. గాజాలోని హమాస్‌తో పాటు సిరియా నుంచి కూడా బుధవారం ఇజ్రాయెల్‌పై దాడులు జరిగాయి. సిరియాలో ఉన్న హమాస్ మద్దతుదారులు సరిహద్దుల్లోని ఇజ్రాయెల్ ప్రాంతాలపై దాడులకు పాల్పడ్డారు. దీంతో ప్రతీకార చర్యల్లో భాగంగానే ఇజ్రాయెల్ ఈ దాడులకు పాల్పడినట్టు చెబుతున్నప్పటికీ అసలు లక్ష్యం వేరే ఉండొచ్చనే అభిప్రాయాలు వెలువడుతున్నాయి. కాగా, ఇజ్రాయెల్ దాడులను సిరియా ఆర్మీ ఖండించింది. గాజాలో ఇజ్రాయెల్ చేస్తున్న మారణహోమాన్ని పక్కదారి పట్టించడానికే తమపై దాడులకు దిగినట్టు ఆ దేశ ఆర్మీ పేర్కొంది.

గాజాలో గ్రౌండ్ ఆపరేషన్?

పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్ హమాస్‌ను నామరూపాల్లేకుండా చేసేందుకు ఇజ్రాయెల్ సిద్ధమైంది. హమాస్‌ను కూకటివేళ్లతో సహా పెకిలించేందుకు సన్నాహాలు చేస్తున్నది. లక్షలాది మంది బలగాలతో గాజాలో అడుగుపెట్టి అక్కడి హమాస్ మిలిటెంట్లను ఏరివేయాలని ఇజ్రాయెల్ ప్రణాళికలు రచిస్తున్నది. భవిష్యత్తులోనూ హమాస్‌తో ముప్పు తప్పదని గ్రహించిన ఇజ్రాయెల్ ఆ గ్రూప్ కార్యకపాలను పూర్తిగా అంతమొందించేందుకు గాజాలో గ్రౌండ్ ఆపరేషన్ చేపట్టేందుకు సిద్ధమవుతున్నది. ఇంటింటికి వెళ్లి మిలిటెంట్ల భరతం పట్టేందుకు ప్లాన్ చేస్తున్నది. అయితే రాజకీయ నిర్ణయం కోసం ఆ దేశ సైన్యం వేచిచూస్తున్నది..

బందీలే అడ్డంకి...

అయితే గాజాలోకి ప్రవేశించి మిలిటెంట్లను మట్టుబెట్టాలని ఇజ్రాయెల్ ప్లాన్ చేస్తున్నప్పటికీ.. అది అంత సులువు కాదని నిపుణులు చెబుతున్నారు. అత్యంత జనసాంద్రత ఉన్న ఉండే గాజా స్ట్రిప్‌లో ఇంటింటికి వెళ్లి మిలిటెంట్లను వెతికి హతం చేయడమనేది సాధ్యం కాకపోవచ్చని వారు పేర్కొంటున్నారు. గాజాలో ఉండే అండర్‌గ్రౌండ్ టన్నెళ్లు దీనికి ప్రధాన కారణం. మరోవైపు హమాస్ చేతిలో బందీలుగా ఉన్న ఇజ్రాయెలీలు, అమెరికా తదితర ఇతర దేశాల పౌరులు ఇందుకు అవరోధంగా మారొచ్చని తెలుస్తున్నది. గ్రౌండ్ ఆపరేషన్‌పై ఇజ్రాయెల్ ఆచితూచి వ్యవహరించడానికి ఇది ఓ కారణమే.

సరఫరాను పునరుద్ధరించబోం...

గాజాను అష్టదిగ్బంధం చేసిన ఇజ్రాయెల్ పట్టువిడవడం లేదు. హమాస్ చేతిలో బందీలుగా ఉన్నవారిని సురక్షితంగా విడిచిపెట్టేంత వరకు నిత్యావసరాలు, నీరు, ఆహారం, ఇంధనం, కరెంటు సరఫరాను పునరుద్ధరించబోమని ఇజ్రాయెల్ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ హమాస్‌ను హెచ్చరించారు. 'బందీలను విడిచిపెట్టేంత వరకు కరెంటు స్విచ్ ఆన్ చేయబోం. నీటి సరఫరా ఉండదు. ఇంధన ట్రక్కులు గాజాలోకి ప్రవేశించవు' అని ఆయన తెలిపారు.

హమాస్‌ను అంతం చేస్తాం

ఇజ్రాయెల్‌పై విచక్షణారహితంగా దాడులకు పాల్పడిన హమాస్‌ను అంత చేస్తామని ఆ దేశ ప్రధాని నెతన్యాహు తెలిపారు. ప్రతి ఒక్క హమాస్ మిలిటెంట్‌ను హతమారుస్తామని ఆయన పునరుద్ఘాటించారు. బుధవారం అర్ధరాత్రి దాటాక ఎమర్జెన్సీ వార్ టైమ్ క్యాబినెట్‌ను ఏర్పాటు చేసిన అంనతరం ఆయన మాట్లాడారు.

హమాస్ దాడులను ఖండించిన బైడెన్

హమాస్ దాడులను అమెరికా అధ్యక్షుడు ఖండించారు. ఇటువంటి విచక్షణారహితమైన దాడులను చూస్తానని అనుకోలేదని ఆయన పేర్కొన్నారు. హోలోకాస్ట్ తర్వాత యూదులకు అత్యంత ఘోరమైన రోజు అని తెలిపారు.

ఇజ్రాయెల్‌లో అమెరికా సెక్రెటరీ

అమెరికా సెక్రెటరీ ఆఫ్ స్టేట్ ఆంటోని బ్లింకెన్ ఇజ్రాయెల్‌కు చేరుకున్నారు. ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి ఈలి చోహెన్‌తో భేటీ అయ్యారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, పాలస్తీనా అధ్యక్షుడు మహమ్మద్ అబ్బాస్, జోర్డాన్ రాజు అబ్దుల్లా -2లను ఆయన శుక్రవారం కలవనున్నారు. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధ పరిస్థితులపై ఆయన చర్చించే అవకాశం ఉంది.

స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటుకు మద్దతు: భారత్

శాంతియుత మార్గంలో స్వతంత్ర, సార్వభౌమాధికార పాలస్తీనా ఏర్పాటుకు మద్దతిస్తామని, అయితే ఉగ్రవాదాన్ని ఉపేక్షించబోమని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి తెలిపారు. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం ప్రారంభమైన తర్వాత మొదటిసారి భారత్ దీనిపై అధికారికంగా స్పందించింది. అరిందమ్ బాగ్చి గురువారం దీనిపై మాట్లాడారు.

గాజాపై ఇజ్రాయెల్ చేసిన దాడిలో గాయపడటంతో రోదిస్తున్న కుటుంబం

ప్రత్యేక విమానంలో 230 మంది

ఇజ్రాయెల్‌లో చిక్కుకుపోయిన భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చేందుకు ఆపరేషన్ అజయ్‌ను చేపట్టిన భారత్ దాన్ని వేగవంతం చేసింది. 230 మంది భారతీయులతో కూడిన ప్రత్యేక విమానం గురువారం రాత్రి 9 గంటలకు బెన్ గురియన్ విమానాశ్రయం నుంచి బయలుదేరనున్నది. ఇందుకు భారత అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇజ్రాయెల్‌లో ఉన్న 18 వేల మంది భారతీయులను సురక్షితంగా స్వదేశానికి చేర్చేందుకు భారత ఎంబసీ అధికారులు ప్రయత్నిస్తున్నారు.

తిండి దొరక్క హాహాకారాలు...

గాజాపై ఇజ్రాయెల్ విధించిన దిగ్బంధం వల్ల ఆ ప్రాంతంలో నివసిస్తున్న లక్షల మంది చీకట్లో మగ్గుతున్నారు. తిండి, నీరు దొరక్క నానా అవస్థలు పడుతున్నారు. అనేకమంది గాజాలోని బేకరీల వద్ద లైన్లలో వేచి ఉన్నారు. అన్నివైపులా సరిహద్దులు మూసివేయడంతో లక్షల మంది పునరావాస కేంద్రాలకు తరలివెళ్లారు. ఇంధనం, కరెంటు లేకపోవడంతో అత్యవసర సేవలు నిలిచిపోయాయి. దవాఖానల్లో క్షతగాత్రులకు చికిత్స, అత్యవసర సేవలకు అంతరాయం ఏర్పడుతున్నది. ఆహారం, నీటి సరఫరా నిలిచిపోవడంతో మరింత మంది ఆకలిదప్పులతో మరణించే ప్రమాదం ఉందని పలు అంతర్జాతీయ సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

శిశు హత్యకు పాల్పడలేం

గర్భవిచ్ఛిత్తి కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ, అక్టోబర్ 12: 'బిడ్డను మేము చంపలేము' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇద్దరు పిల్లల తల్లి అయిన మహిళ 26 వారాల గర్భ విచ్ఛిత్తికి తాము ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలని కోరుతూ కేంద్రం దాఖలు చేసిన పిట